క్లుప్తంగా

పెరిగిన వేతనాలు చెల్లించాలి



సిరిసిల్లటౌన్: బీడీ కార్మికులకు వీడీఏ ప్రకారం పెరిగిన వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. గురువారం పట్టణంలోని బీడీ కార్మికుల సమస్యలపై బీవైనగర్‌లో కార్మికులతో మాట్లాడారు. పీఎఫ్‌ను కటింగ్ కంపెనీలు కట్ చేసినప్పటికీ మళ్లీ టేకేదారులు వసూలు చేస్తున్నారని, కార్మికులు శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికులను నష్టపరిస్తే పోరాటాలు చేస్తామన్నారు. బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కేవీ అనసూర్య, సుంకనపెల్లి శాంత, ఎంజాల లక్ష్మి, కొండ ఈశ్వరి, కర్రె రాజవ్వ, జడల రూప, లక్ష్మి, దేవక్క తదితర బీడీ కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడఅర్బన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ (అర్థశాస్త్రం) విభాగంలో అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ లావణ్య ప్రకటనలో తెలిపారు. సంబంధిత పీజీలో 50 శాతం ఉత్తీర్ణతతో పాటు నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. రాతపరీక్ష, డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 15 అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు వివరిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూరగాయల శ్రీనివాస్ రైతు వ్యవసాయ క్షేత్రంలో అధికారులు రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో వాడే అగ్ని అస్త్రం, నీమస్త్రం, దశ పర్ణిక కషాయం, ద్రవ జీవామృతం వంటి వివిధ రకాల పోషక, పురుగుమందుల పదార్థాలను ఆవు మూత్రం, పేడతో తయారు చేస్తున్నారన్నారు. శిక్షణ సహాయ వ్యవసాయ సంచాలకుడు రామారావు, వ్యవసాయ అధికారి కవిత, మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్, ఏఈవో రాజు, ప్రకృతి వ్యవసాయ ప్రచారక కార్యకర్త శ్రీకాంత్, రైతు కూరగాయల శ్రీనివాస్, మహిళ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కార్యవర్గం



కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో గౌడ సంఘం అధ్యక్షుడిగా తీగల వెంకటి ఎన్నికయ్యారు. గురువారం సమావేశమైన కార్యవర్గ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వెంగలి బుగ్గయ్య, ఉపాధ్యక్షుడిగా పొన్నం పర్శరాములు, సంయుక్త కార్యదర్శులుగా తాళ్లపల్లి శ్రీకాంత్, ఎదురుగట్ల మహేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ తీస్తున్న సీపీఐ కార్యకర్తలు

ఇల్లంతకుంట: మండలకేంద్రం నుంచి గాలిపెల్లిలో బద్దం ఎల్లారెడ్డి స్థూపం వరకు గురువారం సీపీఐ కార్యకర్తలు బైక్ ర్యాలీతీశారు. ఈనెల 11 నుంచి 17వరకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా ర్యాలీ చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘంకార్యదర్శి మంద సుదర్శన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్‌కుమార్, మండల సీపీఐ కార్యదర్శి తిరుపతిరెడ్డి, సావనపల్లి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

సెస్ డైరెక్టర్‌కు వినతిపత్రం

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి అంబేద్కర్ నగర్ (ఎస్సీ కాలనీ)కి అర్బన్ ఫీడర్ ఏర్పాటు చేసి 24 గంటల విద్యుత్ అందించాలని అంబేడ్కర్ యువజన సంఘం గర్జనపల్లి శాఖ ఆధ్వర్యంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశంకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు గజ్జెల రెడ్డి, ప్రధాన కార్యదర్శి దావ పోచయ్య, సభ్యులు దోమకొండ భూమరాజు, గజ్జెల భూమరాజు, లింగంపల్లి శంకర్ తదితరులున్నారు.

రెండు నెలలకే కంకర తేలుతోంది

- మండలకేంద్రంలో రూ.80 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం
- పనుల్లో నాణ్యతా లోపం
- పట్టించుకోని అధికారులు



కంకర తేలుతున్న సీసీరోడ్డు

రుద్రంగి: మండలకేంద్రంలో అభివృద్ధి పనుల్లో భాగంగా వేస్తున్న సీసీరోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రెండు నెలలకే సిమెంట్, కంకర తేలుతోంది. నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు నాణ్యతా లోపంతో పనులు చేపడుతున్నారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రూ.80లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం

మండలకేంద్రంలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఈజీఎస్ నిధులు రూ.80 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారు. కానీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. కొన్నిచోట్ల సీసీ రోడ్లు బాగున్నా వాటిని తొలగించి నూతనంగా సీసీరోడ్లు వేశారు. వేసిన కొన్ని నెలలకే కంకర తేలుతోంది.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు

సీసీరోడ్డు వేసే సమయంలో నాసిరకంగా పనులు చేపడుతున్నారని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు సీసీరోడ్ల నిర్మాణం, నాణ్యతపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిర్మాణ పనుల్లో నాణ్యతపై నిర్లక్ష్యం వహించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రామాణాలు పాటించని కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యవేక్షించాం



సీసీరోడ్ల నిర్మాణాల సమయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాం. కొన్నిచోట్ల కంకర తేలింది వాస్తవమే. కాంట్రాక్టర్లను నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించాం.

– మనోహర్, పీఆర్ఏఈ, రుద్రంగి

ప్రజాభీష్టం మేరకు పనులు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కేక్ కట్ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: ప్రజా ప్రభుత్వంలో ప్రజలు కోరుకున్న విధంగానే పనులు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని 15వ వార్డు లాలపల్లి, బాలానగర్, తిప్పాపూర్‌లలో 43 కులసంఘాల భవనాలకు మంజూరైన రూ.2.58కోట్లు భవన నిర్మాణాలకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి మంజూరైన ప్రొసీడింగ్స్‌ను గురువారం అందజేశారు. బాలానగర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్స్ ప్రారంభించి, రెడ్డి కమ్యూనిటీహాల్‌తోపాటు పలు కమ్యూనిటిహాల్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రతినిత్యం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతుందన్నారు.

ఫ్లెక్సీలు కట్టాల్సింది ఎల్లంపల్లి నీరుపై

కొందరు కాళేశ్వరం లేకుంటే నీళ్ల లేవని ఫ్లెక్సీలు కడుతున్నారని, కానీ వాళ్లు పెట్టాల్సింది ఎల్లంపల్లి ప్రాజెక్టు లేకుంటే నీరు లేవని ఫ్లెక్సీలు పెట్టాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ఈ సంవత్సరం కాళేశ్వరంలోని మేడిగడ్డ వద్ద అసలు నీరే ఆపలేదని, అన్నారం సుందిళ్ల వద్ద బొంగలుపడి చుక్క నీరు నిలువలేదన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి నీరు నిలిస్తే ప్రమాదమని రిపోర్ట్ ఇచ్చారని, నీళ్లు ఆపడం వల్ల కింద గల 40 గ్రామాలకు ఇబ్బంది తలెత్తుతుందని అధికారులు తెలిపారన్నారు. ప్రాజెక్టులో చుక్క నీరు ఆపకున్న కొందరు రాజకీయ పబ్బం గడుపుకునేందుకు, రైతులను తప్పుదోవ పట్టించడానికి ఫ్లెక్సీలు కడుతున్నారన్నారు. కుంగిపోయిన మేడిగడ్డ, ఇసుక దిబ్బల కింది నుంచి వెళ్తున్న అన్నారం సుందిళ్ల ఫొటోలను గ్రామాల్లో కట్టండి అని సూచించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

గాయత్రి బ్యాంకు 25వ వార్షికోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని భీమేశ్వరాలయం వీధిలోని బ్రాంచ్‌లో సిల్వర్‌జూబ్లీ వేడుకలు గురువారం నిర్వహించారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ చీఫ్ మేనేజర్ వంశీ, మేనేజర్ గజేంద్ర, ఖాతాదారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం స్వీట్లు పంచారు. బ్యాంకు అధికారులు సుదర్శన్, రాజు, యశ్వంత్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

గంభీరావుపేట: ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం కోరారు. మండలంలో గురువారం శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుచేసి, అన్ని విభాగాల్లో ఎంఈవో, డెప్యూటీ ఈవో, జూనియర్ లెక్చరర్స్ పదోన్నతులు కల్పించాలన్నారు. గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే బకాయిలు విడుదల చేయాలన్నారు. కాగా, ఎస్టీయూ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా నరేశ్‌కుమార్, కోశాధికారిగా రేఖ ఎన్నికయ్యారు.

చదువుపై ప్రత్యేక శ్రద్ధ కల్పించేలా చూడాలి



రుద్రంగి: విద్యార్థులకు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కల్పించేలా చూడాలని మండల కాంప్లెక్స్ హెచ్‌ఎం సమ్మిరెడ్డి పేర్కొన్నారు. మండల కాంప్లెక్స్ పాఠశాల రుద్రంగిలో వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్, రుద్రంగి, చందుర్తి నాలుగు మండలాల ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని ముస్కానిపేట, గాలిపల్లి గ్రామాల్లోని మొక్కజొన్న పంటలను శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. మొక్కజొన్న పంటసాగులో రైతుల సమస్యలను శాస్త్రవేత్తలు తెలుసుకుని పరిష్కారం చూపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుశీల, భద్రు, అనూష, శ్రావణి, కోఆర్డినేటర్ హరికృష్ణ, వ్యవసాయాధికారి సురేశ్‌రెడ్డి, ఏఈవో గంగ, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి రెండో రేషన్ దుకాణాన్ని ఎస్సీలకు మాత్రమే కేటాయించాలని గురువారం గర్జనపల్లి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ముక్తర్ పాషాకు వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ మాట్లాడుతూ..ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న గర్జనపల్లిలో చౌకధరల దుకాణాన్ని ఎస్సీలకు కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు గజ్జెల రెడ్డి, ప్రధాన కార్యదర్శి దావ పోచయ్య, సభ్యులు దోమకొండ భూమరాజు, గజ్జెల భూమరాజు, లింగంపల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు

పేదలకు అన్నదానం

వేములవాడ : మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో గత 1602 రోజులుగా పేదలకు అన్నదానం చేస్తున్నారు. గురువారం 150 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, గుమ్మి పవన్, వేణు, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

వీర్నపల్లి: మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేముల లక్ష్మణ్ తెలిపారు. మండలకేంద్రంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై..

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి నుంచి తంగళ్లపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి ఓ వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నరేంద్రబాబును కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టుపురుగుల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మల్లికార్జున్

ముస్తాబాద్: పట్టుపురుగుల పెంపకంపై సెరీకల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ మల్లికార్జున్ అవగాహన కల్పించారు. ముస్తాబాద్ మండలం గూడూరులో గురువారం పట్టుపురుగుల సాగుపై మేరా రేషమ్–మేరా అభియాన్‌లో భాగంగా రైతులకు శిక్షణ ఇచ్చారు. »పట్టు పురుగు తెగులు మరియు వ్యాధి నిర్వహణ« అంశంపై అవగాహన కల్పించారు. పట్టు పురుగు కోకన్ నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా సెరీకల్చర్ అధికారి శ్రీలత మాట్లాడుతూ పట్టు పురుగుల పెంపకం, సాగుపై పూర్తి మద్దతు ఉంటుందన్నారు. డాక్టర్ రాఘవేందర్, రైతులు రాజేందర్‌శర్మ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులతో సమావేశం



పెన్షన్ దారులతో మాట్లాడుతున్న అధికారులు

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్లలో డీఆర్డీవో శేషాద్రి ఆధ్వర్యంలో పెన్షన్ లబ్ధిదారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్ తీసుకుంటున్న వారి వివరాలు అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ, కార్యదర్శి వంశీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల



బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం ఎల్‌ఎండీకి 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 13,300 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లోగా చేరుతోంది. మిడ్‌మానేరు నుంచి ప్యాకేజీ–9కి 1,030, ప్యాకేజీ–10 అనంతగిరికి 6,400 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 26.991టీఎంసీలకు చేరింది.

ఇందిరమ్మ ఇళ్లకు 683 దరఖాస్తులు

బోయినపల్లి: మధ్యమానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన మండలంలోని కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి ముంపు గ్రామాల నిర్వాసితుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు 683 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి గురువారం తెలిపారు. రెండురోజులుగా ఆయా గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

2,800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

ఇల్లంతకుంట: సాగు విస్తీర్ణానికి సరిపడా యూరియా సెప్టెంబర్ చివరివరకు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సురేశ్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలో ఖరీఫ్‌లో 24వేల ఎకరాల్లో వరి, పత్తి 12 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారన్నారు. ఇప్పటివరకు 2,800 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి సరఫరా చేశామన్నారు.

పిడుగుపాటుతో గేదె మృతి

ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్‌లో పయ్యావుల రామకృష్ణకు చెందిన గేదె పిడుగుపాటుతో మృతిచెందింది. తన పొలం వద్ద గేదెను కట్టివేయగా గురువారం పిడుగుపడటంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు రామకృష్ణ తెలిపాడు.

మద్యం మత్తులో బీరుసీసాతో దాడికి యత్నం

చందుర్తి: మండలంలోని నర్సింగపూర్‌లోని ఓ బెల్టు షాపులో బుధవారం రాత్రి ఇద్దరు పాత కక్షల నేపథ్యంలో దాడి చేసుకున్నారు. నర్సింగాపూర్‌లో ఓ వ్యక్తి ప్రత్యేకంగా ఇంటిని అద్దెకు తీసుకుని బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. అక్రమంగా మద్యం విక్రయించడమే కాకుండా యథేచ్ఛగా సిట్టింగ్ ఏర్పాటు చేశాడు. ఆర్డర్‌పై చికెన్, మటన్, చేపలు, ఇతర తినుబండారాలు సరఫరా చేస్తున్నారు. బుధవారం రాత్రి బెల్టుషాపులో మద్యం తాగుతున్న ఓ వ్యక్తి పక్కనే కూర్చున్న మరో వ్యక్తికి మధ్య మాటామాట పెరిగింది. ఈక్రమంలో వీరి పక్కనే కూర్చున్న మరొకరు చెప్పితేనే తనను తిడుతున్నావంటూ మొదటి వ్యక్తి మూడో వ్యక్తిపై బీరుసీసాతో దాడికి యత్నించాడు. దీంతో సదరు మూడో వ్యక్తి వెంటనే చందుర్తి పోలీసులను ఆశ్రయించాడు. గురువారం ఇద్దరిని పిలిపించిన పోలీసులు ఒకరిజోలికి ఒకరు పోవద్దంటూ హెచ్చరించి పంపించి వేశారు. కాగా ఇదే విషయమై ఎస్సై రమేశ్‌ను వివరణ కోరగా ఇది పిటీ కేసు ఏమి చెప్పాలని నిట్టూర్పుగా బదులిచ్చారు. అయితే నర్సింగాపూర్‌లో దాబాలను మరిపించే రీతిలో బెల్టుషాపులో సిట్టింగ్‌లను ఏర్పాటు చేసి అర్ధరాత్రి వరకు చుట్టుపక్కల వారికి నిద్ర లేకుండా చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. పోలీసులకు మామూళ్లు ముట్టజెప్పడంతోనే పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



చందుర్తి: చందుర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలోనే వ్యర్థాలు పారబోస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడల్లా దుర్వాసన రావడంతో పాటు వరదకు వ్యర్థాలు కొట్టుకువచ్చి ఆస్పత్రి వచ్చేవారికి సిరంజీలు గుచ్చుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : సురేశ్‌కుమార్
ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి, చందుర్తి, సెల్ : 9182538790

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

క్షయవ్యాధి రహిత గ్రామాలను తీర్చిదిద్దుదాం

- జిల్లా వైద్యాధికారి రజిత



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్

సిరిసిల్ల: జిల్లాలోని గ్రామాలను క్షయవ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎస్.రజిత కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రజిత మాట్లాడుతూ మండలానికి ఒక్క గ్రామాన్ని మోడల్‌గా తీసుకుని టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతీ గ్రామంలో ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని టీబీ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ముందుగా టీబీ వ్యాధి లక్షణాలు గుర్తించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షల చేయాలని, టీబీ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. క్షయవ్యాధిని నిర్ధారిస్తే తీసుకోవాలిన్సన జాగ్రత్తలు, ట్రీట్‌మెంట్ విధానాన్ని సూచించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి లభించే సదుపాయాలు కల్పించాలని కోరారు. టీబీ ముక్త్ గ్రామపంచాయతీలుగా చేయుటకు తీసుకోవాల్సిన చర్యల గురించి జిల్లా వైద్యాధికారి వివరించారు. గ్రామాల్లో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఏమైనా అపోహలుంటే తొలగించాలన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో జిల్లాలో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ ప్రోగ్రాంలో ప్రతి ఆరోగ్య సబ్ సెంటర్ నుంచి ఇద్దరు టీబీ చాంపియన్లను గుర్తించి వారి ద్వారా ఆయా సబ్ సెంటర్ పరిధిలోని ప్రజలకు టీబీ వ్యాధిపైన అవగాహన కల్పించామని గుర్తు చేశారు. డీపీవో షరీఫొద్దీన్, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత, ఇంపాక్ట్ ఇండియా ప్రోగ్రాం జిల్లా అధికారి శ్రీనివాస్, వైద్యసిబ్బంది, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: ఈనెల 15న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా కోరారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశామన్నారు. సెప్టెంబర్ 15న కామారెడ్డిలో నిర్వహించే సభకు సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ తదితరులు హాజరుకానున్నారన్నారు. అన్నిగ్రామాల ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్, నాయకులు బైరగోని నందు, మానుక సత్యం, శోభన్, సత్యం, బొర్ర రవి, రవి, రమేశ్‌రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట: ప్రధాని మోదీ కానుకగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తుండగా గురువారం మండలకేంద్రంలోని జెడ్పీ బాలుర, బాలికల, ఊర్దూ మీడియం ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న వంద మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండలశాఖ అధ్యక్షుడు కోడె రమేశ్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు దేవసాని కృష్ణ, మల్లేశం యాదవ్, రాజేందర్‌రెడ్డి, మహేశ్ యాదవ్, లక్ష్మీపురం రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• అక్టోబర్ 2 వరకు సేవా కార్యక్రమాలు

ఇల్లంతకుంట: రానున్న స్థానిక ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిచర్ల రాజు అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సేవాపక్షం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్, సేవాపక్షం మండల కన్వీనర్ మేకల మల్లేశం, ముత్తవ్వ, శ్రీనివాస్, మామిడి హరీశ్, చంద్రం, తదితరులు పాల్గొన్నారు

• నిరుద్యోగులకు నష్టం

వేములవాడ: గ్రూప్– 1 ఫలితాల్ని రద్దుచేస్తూ ఇచ్చిన హైకోర్టు తీర్పు వెలువరించడంతో వేలాది మంది నిరుద్యోగులకు నష్టం కలుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి గురువారం తెలిపారు. కష్టపడి చదివి, మంచి ఉద్యోగం సాధించాలనే తపన నీరు గారిపోయిందన్నారు. హైకోర్టు ఆదేశాలను పాటించి, గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలన్నారు.

• జీపీవోల కేటాయింపు

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాలకు గ్రామపాలన అధికారులు (జీపీవో)లను కేటాయించారు. తంగళ్లపల్లి–1కి మాదాసు రాజు, తంగళ్లపల్లి–2కి కె.ఆంజనేయులు, బద్దెనపల్లికి మామిండ్ల వేణు, ఓబులాపూర్ (పీకే) మల్లారం అర్జున్, జిల్లెల్లకు గడ్డం లావణ్య, తాడూర్–1కి నక్క సాయికుమార్, తాడూర్–2కి ఉప్పుల భరత్ సాయిరాం, కస్బెకట్కూర్, గండిలచ్చపేట, వేణుగోపాలపూర్ గ్రామాలకు మ ద్రిపల్లి అంజలి, నేరెళ్ల, సారంపల్లికి పండుగ పరుశరాములు, మండెపల్లికి ముద్దం సా యితేజ, చీర్లవంచ, చింతలఠాణాకు గొల్లపల్లి శ్రీనివాస్, బస్వాపూర్, రామచంద్రాపూర్, నర్సింహులపల్లె గ్రామాలకు పుట్ట స్వప్నను కేటాయించారు.

• పరామర్శ

ఎల్లారెడ్డిపేట: వీర్నపల్లి మండలానికి చెందిన సీనియర్ కార్యకర్త భూత వినోద్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మండలంలోని బాకూర్‌పల్లి తండాకు చెందిన కార్యకర్త జోహార్ తండ్రి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారిద్దరిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పరామర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన బొల్లారపు రాజయ్య ఇటీవల మృతిచెందగా మాజీ సర్పంచ్ అంకారపు అనిత రవీందర్ పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. ఇక్కడ నాయకులు బొల్లారం శంకర్, బూడిద స్వామి, కందుకూరి రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.